సాక్షి గుంటూరు

ఆదివారం : 28 : జులై : 2024



పేరంటాలమ్మకు పూజలు

నాదెండ్ల: సాతులూరు గ్రామంలో రూ.2 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న రెడ్డి పేరంటాలమ్మ తల్లి ఆలయానికి శనివారం ముఖద్వార ఏర్పాటుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.



డీజీపీని కలిసిన ఎస్పీ తుషార్‌డూడీ

బాపట్లటౌన్: బాపట్ల జిల్లా ఎస్పీ తుషార్ డూడీ శనివారం డీజీపీ సీహెచ్.ద్వారకా తిరుమలరావును మంగళగిరిలోని ఏపీ పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేశారు.

నేడు మహాలక్ష్మమ్మ తిరునాళ్ల



దాచేపల్లి : ప్రజల కొంగు బంగారమైన మహాలక్ష్మమ్మ తిరునాళ్ల ఆదివారం జరగనున్నది. ఈ సందర్భంగా శనివారం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

న్యూస్‌రీల్

వినుకొండ నుంచి మహానందికి ప్రత్యేక బస్సు

వినుకొండ(నూజెండ్ల):వినుకొండ డిపో నుంచి మహానంది, యాగంటి, అహోబిలం, ఒంటిమిట్ట, బ్రహ్మంగారి మఠం, సిద్ధయ్య మఠం యాత్రకు ప్రత్యేక బస్సును ఏర్పాటుచేస్తున్నట్లు ఆర్టీసీ డీఎం కోటేశ్వరనాయక్ తెలిపారు. ఆగస్టు 9వ తేదీ సాయంత్రం 9 గంటలకు వినుకొండ నుంచి బస్సు బయలుదేరి 10వ తేదీ ఉదయం మహానంది చేరుకొని దర్శనం చేసుకొంటారు. అక్కడి నుంచి 11 గంటలకు యాగంటి చేరుకొని సాయంత్రం అహోబిలం తరువాత రాత్రికి ఒంటిమిట్ట చేరుకుంటారన్నారు. 11వ తేదీ ఉదయం రాములవారి దర్శనం చేసుకొని మధ్యాహ్నానికి బ్రహ్మంగారి మఠం, సిద్దయ్య గారి మఠాలను దర్శించుకొని 12వ తేదీ ఉదయం తిరిగి వినుకొండకు చేరుకుంటారని తెలిపారు. టికెట్ ధర రూ.1500 ఉంటుందన్నారు. వివరాలకు 9949225431, 7382898320 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఏబీఆర్ కాలేజీని సందర్శించిన విద్యా శాఖ కమిషనర్

రేపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాల న్యాక్ ప్లస్‌కు ఎంపికైన సందర్భంగా కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్ శనివారం సందర్శించారు. కళాశాలలో నూతనంగా ఏర్పాటుచేసిన న్యాక్ ప్లస్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి విద్యార్థులతో మాట్లాడారు. తీర ప్రాంతం రేపల్లెలోని డిగ్రీ కళాశాల న్యాక్ ప్లస్‌కు ఎంపికకావడం అభినందనీయమన్నారు.

నవోదయలో రెండు రోజుల వైజ్ఞానిక ప్రదర్శన

చిలకలూరిపేట(యడ్లపాడు): విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికి తీసి...నూతన ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు వైజ్ఞానిక పోటీలను ఏర్పాటు చేసినట్లు జేఎన్‌వీ ప్రిన్సిపాల్ నల్లూరి నరసింహారావు తెలిపారు. సోమ, మంగళవారాల్లో నవోదయ విద్యాసమితి పరిధిలోని ఏడు ఉమ్మడి జిల్లాల స్థాయిలో క్లస్టర్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీలు ఉంటాయన్నారు. సైన్స్, సోషల్, మ్యాథ్స్, ఎస్‌యూపీడబ్ల్యూ, ఇన్ఫర్‌మేషన్ టెక్నాలజీ తదితర సబ్జెక్టులకు సంబంధించిన నూతన ఆవిష్కరణలు ప్రదర్శితమవుతాయన్నారు. శ్రీకాకుళం నుంచి గుంటూరు ఉమ్మడి జిల్లాలకు చెందిన జేఎన్‌వీ విద్యార్థులు హాజరై తాము తయారుచేసిన ప్రాజెక్టుల్ని ఈ పోటీలకు తీసుకువస్తారన్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని అన్ని పాఠశాలల విద్యార్థులు పోటీలను తిలకించేందుకు అనుమతినిచ్చినట్లు తెలిపారు. విజేతలు క్లస్టర్‌స్థాయి నుంచి జేఎన్‌వీ ప్రాంతీయస్థాయి పోటీల్లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు.

నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణకు చర్యలు



బాపట్ల : నల్లమడ డ్రెయిన్ ఆధునికీకరణకు చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మరాజు పేర్కొన్నారు. బాపట్ల మండలంలోని నల్లమడ డ్రెయిన్‌ను శనివారం ఆయన పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. తక్షణ చర్యల్లో భాగంగా డ్రెయిన్ లాకులు మరమ్మతు చేయించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. డ్రెయిన్‌లో తూటికాడ తొలగింపునకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఆయన వెంట నీటిపారుదల శాఖ అధికారులు ఉన్నారు.

హాస్టల్‌లో ఫోన్ ద్వారా స్పాట్ అడ్మిషన్

చిలకలూరిపేట: పల్నాడు జిల్లా మురికిపూడి గ్రామంలో ఉన్న సాంఘీక సంక్షేమ బాలుర వసతి గృహంలో ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు వసతి గృహ సంక్షేమ అధికారి కె. రాజాబాబు చెప్పారు. హాస్టల్‌లో ఎస్సీ -12, ఎస్టీ- 3, ఓసీ-4 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. ఆరు నుంచి తొమ్మిదవ తరగతి చదివే విద్యార్థులు దరఖాస్తు చేయవచ్చన్నారు. ఫోన్ చేసి స్పాట్ అడ్మిషన్ పొందవచ్చని తెలిపారు. ఇందు కోసం ఫోన్ నంబర్ 74165 16599లో సంప్రదించాలన్నారు.

31న పాలిటెక్నిక్ స్పాట్ అడ్మిషన్లు

గుంటూరుఎడ్యుకేషన్: ఏపీ పాలిసెట్-2024 కన్వీనర్ విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు ఈనెల 31న అమరావతి రోడ్డులోని హిందూ ఇంజినీరింగ్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చిన్నం సుబ్బారావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సివిల్, ఎలక్ట్రికల్ ఈసీఈ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అండ్ మెషీన్ లెర్నింగ్, సీఎస్ఈ బ్రాంచ్‌ల్లో సీట్లు భర్తీ చేసేందుకు నిర్వహిస్తున్న స్పాట్ అడ్మిషన్లకు అర్హులైన వారు ఒరిజినల్ సర్టిఫికెట్లతో నేరుగా హాజరు కావాలన్నారు.

ఇసుక తోడేస్తున్నారు!

- టీడీపీ నేతల ఇష్టారాజ్యం
- అధికారికంగా వైకుంఠపురం రీచ్‌కు అనుమతి
- అనధికారికంగా మల్లాది, మునగోడుల్లో తవ్వకాలు
- రాత్రి పూట తవ్వకాలు..పగలు గప్‌చుప్
- పట్టించుకోని అధికారులు

తాము అధికారంలోకి వస్తే ప్రజలందరికీ ఉచితంగా ఇసుక ఇస్తామని కూటమి నేతలు ప్రగల్భాలు పలికారు. అధికారంలోకి రాగానే ఉచితం మాట పక్కన పెట్టి దోపిడీకి తెరతీశారు. అధికారికంగా ఒక్క రీచ్‌కు మాత్రమే అనుమతి ఇవ్వగా అనధికారికంగా మల్లాది, మునగోడు రీచ్‌లలో తవ్వకాలు చేస్తున్నారు కూటమి నేతలు. పగలు సైలెంట్‌గా ఉంటూ రాత్రిళ్లు ఇసుకను అక్రమంగా తరలిస్తూ జేబులు నింపుకుంటున్నారు. అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారు.

అమరావతి:ప్రభుత్వం అధికారికంగా వైకుంఠపురం ఇసుక రీచ్ నుంచి ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వగా మండల పరిధిలోని మల్లాది, మునగోడు ఇసుక రీచ్‌లలో నిర్వహిస్తున్నారు.

- మల్లాదిలో గతంలో ఇసుక అక్రమ తవ్వకాలు జరుపుతుండగా అధికారులు గుర్తించి 10 రోజుల కిందట రీచ్‌లోకి వాహనాలు వెళ్లకుండా దారిలో పెద్దగాడి తీయించారు. ఇదిలా ఉంటే వారం రోజులుగా కూటమి నేతలు గాడి పూడ్చి రీచ్‌లోకి వెళ్లి రాత్రి పూట వాహనాలకు పొక్లెయినర్‌తో ఇసుక లోడింగ్ చేస్తున్నారు. తెల్లావారేసరికి యథావిధిగా గాడితీసి ఉంచుతున్నారు. ఈ పద్ధతిలో రోజుకు సుమారు 50 నుంచి 100 ట్రాక్టర్ల ఇసుక బయటకు పోతున్నట్లు సమాచారం. ఇలా ఇసుక లోడ్ చేసినందుకు ట్రాక్టర్‌కు ఐదు వందల రూపాయలకు పైగా వసూలు చేస్తున్నారు.
- మునగోడులో పట్టపగలే ఇసుకను మనుషులతో లోడ్ చేయించి గ్రామంలో రెండు మూడు చోట్ల నిల్వ ఉంచారు. ప్రభుత్వ విధి విధానాలకు వ్యతిరేకంగా అక్రమంగా రీచ్‌లో ఇసుక తవ్వకాలు చేస్తున్న విషయం మైనింగ్ అధికారులకు, పోలీస్ అధికారులకు తెలిసిన చూసీచూడనట్టు వదిలేస్తున్నారు.

ఉచితం మాటున అక్రమ వసూళ్లు

మండల పరిధిలోని వైకుంఠపురం ఇసుకరీచ్‌లో ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఉచిత ఇసుక పథకం ద్వారా ఈనెల 8వ తేదీ నుంచి ఇసుక రవాణా ప్రారంభించారు. గతంలో డంప్ చేసిన 64,467టన్నుల ఇసుకను సక్రమ పద్ధతిలో లోడ్ చేయటానికి రెవెన్యూ శాఖ నుంచి వీఆర్వోను, క్యూ పద్ధతి అమలు చేయటానికి పోలీసు సిబ్బందిని నియమించారు. ఈ క్రమంలో ఇసుక రీచ్‌లో కొంత మంది అధికార పార్టీకి చెందిన వారు అక్రమ వసూళ్లకు తెరతీశారు. ఇసుక అవసరమైన వినియోగదారుడు తెస్తే ఆధార్ కార్డుతో మాత్రమే బిల్లులు రాస్తున్నారు. అక్రమార్కులు ఇతరుల ఆధార్ కార్డులు తెచ్చి బిల్లులు నమోదు చేయిస్తున్నారు. ముందు వచ్చిన వారికి ముందు అనే పద్ధతికి విరుద్ధంగా అధికార పార్టీ వారికి ఒకేసారి 5 లేక 10 బిల్లులు రాస్తున్నారు. ఈ బిల్లులను లారీ యజమానులకు ఇచ్చి అదనంగా వారి నుంచి వెయ్యి రూపాయలు వసూలు చేసి జేబులు నింపుకుంటున్నారు. ఈ పద్ధతి కొనసాగటానికి కొందరు వీఆర్వోలు సహకరించినట్లు సమాచారం.



వైకుంఠపురంలో వాహనాలకు ఇసుక లోడ్ చేస్తున్న దృశ్యం

అధికారుల ఎదుట వాహనదారుల ఆవేదన

గత గురువారం సాయంత్రం సత్తెనపల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి మురళీకృష్ణ వైకుంఠపురం ఇసుకరీచ్ పరిశీలనకు వచ్చినప్పుడు లారీ డ్రైవర్లు, యజమానులు, గ్రామస్తులు తాము వాహనాలు పెట్టుకుని గంటల తరబడి వేచి ఉన్నప్పటికీ రోజుకు ఒక్క ట్రిప్ కూడా వేయలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అదనంగా రూ.1000 చెల్లించి బిల్లులు రాయించుకున్న వారు రోజుకు రెండు నుంచి మూడు ట్రిప్‌లు తోలుకుంటున్నారని ఫిర్యాదు చేశారు. ఆర్డీవో మురళీకృష్ణ రికార్డులు పరిశీలించి ఇటువంటి తప్పులు జరగకుండా చూస్తామని హామీ ఇచ్చి వెళ్లారు.



స్టాక్ పాయింట్‌లో బారులుతీరిన వాహనాలు

అక్రమ తవ్వకాలు జరగకుండా చర్యలు

మండలంలోని ఇసుక రీచ్‌లలో ఎటువంటి అక్రమ తవ్వకాలు జరగకుండా రెవెన్యూ, పోలీసుశాఖ సమన్వయంతో రాత్రి పూట డ్యూటీలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. వైకుంఠపురం ఇసుక రీచ్‌లో అధికంగా డబ్బు వసూళ్లు చేస్తున్నట్లు వచ్చిన అభియోగాలపై విచారణ జరుపుతున్నాం. ప్రస్తుతం రీచ్‌లోకి రెవెన్యూ సిబ్బంది కాకుండా బయటి వ్యక్తులు రావటాన్ని నిషేధించాం. ఈ నిషేధాన్ని అమలు చేయటానికి పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని రీచ్‌లోకి లారీకి సంబంధించిన డ్రైవర్ మాత్రమే ఉండేలా చర్యలు తీసుకుంటున్నాం.

–సునీత డిప్యూటీ తహసీల్దార్, అమరావతి మండలం

చర్యలు శూన్యం

అక్రమాలపై ఇంతవరకూ చర్యలు తీసుకోలేదు. ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల వీఆర్వోలు రోజుకు ఒకరు చొప్పున వైకుంఠపురం ఇసుక రీచ్‌లో విధులు నిర్వహించాలని ఆదేశాలు జారీ చేశారు. వైకుంఠపురం రీచ్‌లో శుక్రవారం నుంచి గతంలో మాదిరి రూ.1000 అదనంగా తీసుకుని బిల్లులు రాయించటం మానేసి నేరుగా లారీ యజమానుల వద్ద రూ.500 వసూలు చేస్తున్నట్లు సమాచారం.

శిక్షణ, ఉపాధి కల్పనపై యాక్షన్ ప్లాన్

జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి



లక్ష్మీపురం: జిల్లాలోని స్కిల్ డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులందరూ సీడాప్, డీఆర్‌డీఏ, మెప్మా అధికారులను సమన్వయం చేసుకొని నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉపాధి కల్పనపై ప్లాన్ ఆఫ్ యాక్షన్ తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి పేర్కొన్నారు. స్థానిక జిల్లా కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లాలో జరుగుతున్న స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్, యువతకు ఉపాధి అవకాశాలు కల్పనే, గత సమావేశంలో తీసుకున్న చర్యలపై సమీక్ష నిర్వహించారు. డీఆర్‌డీఏ పీడీ హరిహరనాథ్ మాట్లాడుతూ జిల్లాలోని 9 స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటుచేశామని తెలిపారు. నిర్మాణ రంగం, ఆటో మొబైల్, వ్యవసాయం, బ్యూటిషియన్, హోటల్ మేనేజ్‌మెంట్, ఐటీ రంగాల్లో యువతకు శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లా ఉపాధి అధికారి రఘు మాట్లాడుతూ గత ఆరు మాసాల నుంచి సీడాప్‌తో కలసి జాబ్‌మేళాలు నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఏబీఆర్ఎస్ ఈటీఐ డైరెక్టర్ రాజశేఖర్ మాట్లాడుతూ ఏసీ రిపేర్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీలో శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మాట్లాడుతూ కొత్త ప్రభుత్వంలో నిర్మాణ, సర్వే రంగాలకు ఎక్కువ డిమాండ్ ఉందని, బిల్డర్ అసోసియేషన్‌తో మాట్లాడి వారికి ఎలాంటి నైపుణ్యం గల వారు కావాలో తెలుసుకుని ఆయా రంగాల్లో యువతకు ఉపాధి కల్పించాల్సి ఉందన్నారు. మంగళగిరిలో చేనేత క్లస్టర్స్ ఏర్పాటు చేసి ఎలాంటి వృత్తి నైపుణ్యం గల వారు కావాలో, వారికి ఎలాంటి శిక్షణ ఇవ్వాలో వారికి జీవనోపాధి ఎలా ఉంటుందో ఆలోచించి ప్లాన్ ఆఫ్ యాక్షన్‌ను తయారు చేయాలన్నారు. ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్స్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

ప్రకృతి సేద్యం.. ఆరోగ్య భాగ్యం

పురుగుమందులు, ఎరువుల వాడకం పెరిగింది. దీంతో సారవంతమైన భూమి నిస్సారమవుతుంది. ప్రజల ఆరోగ్యం దెబ్బతింటుంది. వీటన్నింటికి చెక్ పెట్టడమే లక్ష్యంగా వ్యవసాయ అధికారులు ప్రణాళిక రచించారు. ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేసేలా రైతన్నను ప్రోత్సహిస్తున్నారు. ఫలితంగా జిల్లాలో ప్రకృతి సేద్యం ఆశాజనకంగా ముందుకు సాగుతోంది.



నవధాన్యాల పంట

- పురుగుమందులు లేని ప్రకృతి వ్యవసాయంపై రైతుల ఆసక్తి
- పెట్టుబడి ఖర్చులు తగ్గించుకునేలా చర్యలు
- సాగు పెరిగేలా ప్రకృతి సేద్య సిబ్బంది ప్రణాళిక
- 2024-25 ఏడాదిలో 52వేల ఎకరాల సాగు లక్ష్యం

నరసరావుపేట రూరల్: జిల్లాలో రైతులు ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేస్తున్నారు. పంటల సాగుకు సహకారం అందిస్తూ వ్యవసాయ పరంగా ఆర్థిక స్వావలంబన సాధించేందుకు అధికారులు కృషిచేస్తున్నారు. ఆ దిశగా జిల్లా స్థాయి అధికారుల నుంచి క్షేత్ర స్థాయి సిబ్బంది వరకు అందరూ కృషి చేస్తున్నారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో ఈ ప్రకృతి వ్యవసాయ సాగు చేపట్టేలా రైతులకు అవగాహన కల్పిస్తూ ఏటేటా ప్రకృతి వ్యవసాయ సాగును జిల్లాలో విస్తరింపచేస్తున్నారు. దీంతోపాటు పండ్ల తోటలు, కూరగాయల పంటలు, ప్రధాన పంటల్లో అంతర పంటలను సాగు చేస్తూ లాభాలు ఆర్జిస్తున్నారు.

జిల్లాలో 28మండలాల పరిధిలో...

జిల్లాలో 28 మండలాల పరిధిలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 52 వేల ఎకరాల్లో వరి, పత్తి, మిరప, జొన్న, శనగ పంటలను ప్రధానంగా సాగుచేస్తున్నారు. ప్రధాన పంటల సాగుకు ముందు నవధాన్యాల పంటల సాగు చేస్తే భూమికి అవసరమయ్యే పోషకాలు పెరిగే అవకాశం ఉండటంతో ఈ పద్ధతిపై వ్యవసాయ విభాగం దృష్టి సారించింది. ఫలితంగా వ్యవసాయ శాఖ రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రకృతి వ్యవసాయ విభాగం పర్యవేక్షణలో జిల్లాలో 305 రైతుభరోసా కేంద్రాల పరిధిలో 222 గ్రామాల్లో 1074 మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటి వరకు వివిధ పంటల సాగులో రసాయన ఎరువులను మోతాదుకంటే అధికంగా వాడటం వలన భూసారం కోల్పోయి క్రమేపి పంట దిగుబడి శాతం తగ్గిపోతుంది. దీనికి తోడు ఒకే పంటను సాగుచేస్తుంటడంతో పొలాల్లో పోషకాల అసమతుల్యత ఏర్పడింది. ఇటువంటి తరుణంలో నవధాన్యాల పంటల సాగు భూసారాన్ని పరిరక్షించడంలో కీలకపాత్ర పోషించనున్నాయి. వీటి సాగు వల్ల తక్కువ ఖర్చుతో అధిక పోషకాలు మొక్కకు అందిచడంతో పాటు నేల భౌతిక లక్షణాలు మెరుగుపడి నేల ఆరోగ్యం కాపాడుతాయి. దీంతో ప్రస్తుతం జిల్లాలో చాలా మంది రైతులు ప్రధాన పంటలకు ముందుగా నవధాన్య పంటలను సాగు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటి వరకు జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 47వేల నవధాన్య కిట్‌లను 39వేల మంది రైతులకు పంపిణీ చేశారు. దాదాపు40 వేల ఎకరాల్లో నవధాన్య పంటలను ఈ ఏడాది సాగు చేయనున్నారు. ఖరీఫ్ సీజన్‌లో భాగంగా జులై చివరి వరకు ఈ నవధాన్య పంటల సాగు మరింత విస్తీర్ణంలో చేయనున్నారు.



ప్రకృతి సేద్యంలో సాగవుతున్న మొక్కజొన్న పంట

2024-25 సంవత్సరంలో పంటల సాగు లక్ష్యం

సాగయ్యే పంటలు	రైతుల సంఖ్య	విస్తీర్ణం ఎకరాల్లో
వరి (బోర్ల కింద)	6330	8643
వరి (ఎన్‌ఎస్‌పి కాలువ)	6661	4507
పత్తి	19,483	23,317
మిరప	13,421	13,750
ఇతర పంటలు	3626	1783
మొత్తం	49,521	52,000

నవధాన్య పంటల సాగుతో ప్రయోజనాలు ఇలా..

- భూమిలో సూక్ష్మ, స్థూల పోషకాలు లభ్యమవుతాయి
- సేంద్రియ కర్బన శాతం పెరుగుతుంది.
- ఏడాది పొడవునా భూమిలో పైరు ఉంటుంది. నేల చీలిపోకుండా ఉంటుంది.
- నవధాన్యాల సాగుతో వేళ్ల మధ్య సంపర్కం పెరిగి మొక్కకు కావాల్సిన పోషకాలు తయారవుతాయి.
- నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం ఉంటుంది.
- ప్రధాన పంటల సాగులో చీడపీడలు ఆశించవు.
- జీవన వైద్యంలో మొక్కకు కావాల్సిన పోషకాలు ఉత్పత్తి అవుతాయి.
- పైరుకు మేలు చేసే సూక్ష్మపోషకాలు వృద్ధి చెందుతాయి.
- నవధాన్య పంటలను పొలంలో కలియదున్నడం వల్ల బాగా చితికి సేంద్రియ పదార్థంగా మారుతుంది.
- నేల భౌతిక లక్షణాల్లో మార్పు జరిగి వేరు వ్యవస్థ బలపడి గాలి, నీరు సులభంగా గ్రహించడానికి వీలవుతుంది.

లక్ష్యం మేర సాగుకు కృషి



ప్రకృతి సేద్యంలో భాగంగా జిల్లాలో 2024-25 ఖరీఫ్, రబీ సీజన్‌లకు 49,521 మంది రైతులతో 52వేల ఎకరాల్లో వివిధ పంటల సాగు లక్ష్యంగా నిర్దేశించాం. ఈ మేరకు ప్రకృతి సిబ్బందితో కలిసి లక్ష్య సాధనకు కృషిచేస్తాను.

– కె.అమలకుమారి, ప్రకృతి వ్యవసాయం, జిల్లా ప్రాజెక్ట్ అధికారి

ఇష్టానుసారంగా వాహనాలు నడపొద్దు

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి

నగరంపాలెం: రహదారులపై ఇష్టానుసారంగా వాహనాలు నడపొద్దని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) టి.లీలావతి అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ, తూర్పు ట్రాఫిక్ పీఎస్ ఆధ్వర్యంలో శనివారం ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మోటారు వాహనాల చట్టాలపై, అవగాహనా సదస్సు, న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సంస్థ కార్యదర్శి లీలావతి మాట్లాడుతూ ఇంటి నుంచి బయటకు వచ్చేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని అన్నారు. రహదారులపై స్నేక్ డ్రైవింగ్ చేయవద్దని చోదకులకు హితవు పలికారు. ఏదైనా ప్రమాదం జరిగితే ఇరు కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు. సదస్సులో ప్రిన్సిపల్ సివిల్ జడ్జి ఎ.అనిత (సీనియర్ డివిజన్), తూర్పు ట్రాఫిక్ పీఎస్ సీఐ బి.కోటేశ్వరరావు, పోలీస్, ఆర్టీసీ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లీలావతి

ర్యాగింగ్ కేసులో ఐదుగురి అరెస్ట్

నరసరావుపేటటౌన్: రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఎన్‌సీసీ క్యాడెట్స్ ర్యాగింగ్ ఘటన కేసులో ఇప్పటి వరకు ఐదుగురిని అరెస్టు చేశారు. ఇప్పటికే ముగ్గురిని అరెస్టు చేయగా శనివారం మరో ఇద్దరిని అరెస్టు చేశారు. మరొకరు పరారీలో ఉన్నారు. అతని కోసం పోలీసులు గాలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. శ్రీసుబ్బరాయ అండ్‌నారాయణ కళాశాల బాలుర హాస్టల్‌లో ఉంటూ కళాశాలలో విద్యనభ్యసిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థి సీహెచ్.పాల్ థామస్‌పై సీనియర్ ఎన్‌సీసీ క్యాడెట్స్ ర్యాగింగ్ పేరుతో పైశాచికంగా దాడికి పాల్పడిన విషయం విదితమే. దాడులకు సంబంధించిన వీడియో వెలుగులోకి రావటంతో సంఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. బాధితుడి ఫిర్యాదుతో సీనియర్ విద్యార్థులు సత్తెనపల్లి గోపికృష్ణ, దర్శి చెందు, రమావత్ అంజినాయక్, యారగాని అజయ్‌కుమార్, యనమల నరేంద్రరెడ్డి, అజయ్‌లపై ఈనెల 24వ తేదీన కేసు నమోదు చేశారు. 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ స్వయంగా కళాశాల హాస్టల్‌కు వెళ్లి ర్యాగింగ్ ఘటనపై ఆరా తీశారు. ఎన్‌సీసీ ఉన్నతాధికారులు సైతం సంఘటనపై శాఖాపరమైన చర్యలకు ఉపక్రమించారు.

ఒలింపిక్స్‌లో అద్భుత ఫలితాలు సాధించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న జిల్లా క్రీడాభివృద్ధి అధికారి నరసింహారెడ్డి, క్రీడాకారులు, శిక్షకులు

లక్ష్మీపురం: పారిస్ ఒలింపిక్స్‌లో భారత క్రీడాకారులు అద్భుత ఫలితాలు సాధించి దేశానికి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి పి.నరసింహారెడ్డి అన్నారు. స్థానిక బీఆర్ స్టేడియంలో రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యాన శనివారం ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ క్రీడా పోటీల్లో భారతదేశ పతాకాన్ని మరింత ఎత్తుకు ఎగురవేసేలా కృషి చేయాలన్నారు. ఒలిపింక్స్ క్రీడా పోటీలకు వెళ్లిన వారి వెంట ప్రతి ఒక్క భారతీయుడు ఉన్నారని అన్నారు. అదే విధంగా దేశ వ్యాప్తంగా క్రీడాకారులను ప్రోత్సహించాల్సిందిగా పేర్కొన్నారు. ఈ ర్యాలీలో క్రీడాకారులు, స్థానికులు, శిక్షకులు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

రక్తదానానికి విద్యార్థులు ముందుకు రావాలి



చేబ్రోలు: రక్తదానం ప్రాణదానంతో సమానమని, విద్యార్థులందరూ రక్తదానానికి పూనుకోవాలని విజ్ఞాన్ విద్యాసంస్థల చైర్మన్ లావు రత్తయ్య పేర్కొన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో శనివారం విద్యార్థులు రక్తదానం చేశారు. చైర్మన్ లావు రత్తయ్య జన్మదినాన్ని పురస్కరించుకుని ఎన్ఎస్ఎస్ విభాగం, జీజీహెచ్ గుంటూరు, నీడ్స్ బ్లడ్ బ్యాంక్, లైఫ్ షేర్, తలసేమీయా నీడ్స్ బ్లడ్ బ్యాంక్‌ల సంయుక్త ఆధ్వర్యంలో యూనివర్సిటీలో ఈ రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు రక్తదానం చేయడంతోపాటు మిత్రులను కూడా భాగస్వాములను చేయాలని కోరారు. రక్తాన్ని కృత్రిమంగా తయారుచేయలేమని, ఎవరైనా దానం చేస్తేనే లభిస్తుందని వెల్లడించారు. ప్రమాదాల సమయంలో బాధితులకు రక్తం అవసరం ఎంతో ఉంటుందని చెప్పారు. సుమారు 400 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. అమ్మ చారిటబుల్ ట్రస్ట్‌కు, వృద్ధాశ్రమానికి, గాంధీ ఆశ్రమానికి, చిన్నపిల్లల ఆశ్రమానికి నిత్యావసర సరుకులు, దుప్పట్లు, చీరలు అందజేశారు. పాఠశాల విద్యార్థులకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. వర్సిటీ వైస్ చాన్స్‌లర్ పి.నాగభూషణ్, రిజిస్ట్రార్ ఎంఎస్ రఘునాథన్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు పాల్గొన్నారు.

టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడి కేసులో ముగ్గురు అరెస్ట్

మంగళగిరి: గుంటూరు జిల్లాలోని టీడీపీ కేంద్ర కార్యాలయంపై దాడిచేసిన కేసులో పోలీసులు తాజాగా శనివారం విజయవాడకు చెందిన మోదుగుల గణపతిరావు, పసుపులేటి ఏసు, వరికూటి నాగిరెడ్డిలను అరెస్ట్ చేసి మంగళగిరి కోర్టులో హాజరుపరచారు. నిందితులపై పోలీస్‌లు పెట్టిన రిమాండ్‌ను కోర్టు తిరస్కరించి, బెయిల్ మంజూరు చేయడంతో ముగ్గురు విడుదలయ్యారు.

వైఎస్సార్ సీపీ శ్రేణులపై దాడులు సరికాదు

గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై జరుగుతున్న దాడులను ప్రతి ఒక్కరూ ఖండించాల్సిన అవసరం ఉందని గుంటూరు నగర మేయర్ కావటి శివ నాగమనోహర్ నాయుడు అన్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని 75 త్యాళ్ళూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు, క్రోసూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఈదా సాంబిరెడ్డిపై టీడీపీ వర్గీయులు దాడికి పాల్పడిన విషయం తెలిసిందే. నగరంలోని సాయి భాస్కర్ హాస్పిటల్‌లో చికిత్సపొందుతున్న సాంబిరెడ్డిని మేయర్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్ సీపీ నేతలు, కార్యకర్తలు, సానుభూతిపరులే లక్ష్యంగా దాడులు జరుగుతున్నాయన్నారు. ప్రజాస్వామ్యంలో ఇటువంటి దాడులకు తావు లేదని, కూటమి నేతలు ఈ దాడులను వెంటనే ఆపివేయాలన్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతున్నాయని, టీడీపీ వర్గీయుల దాడిలో గాయపడిన ప్రతి ఒక్క కార్యకర్తకి పార్టీ అండగా ఉంటుందన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు గుత్తికొండ అంజిరెడ్డి, కాల్వపల్లి సాంబిరెడ్డి, కన్నా హనుమంతరావు, తుమ్మా మర్రి రెడ్డి పాల్గొన్నారు.



సాంబిరెడ్డిని పరామర్శిస్తున్న నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు

రాష్ట్రంలో లైంగిక దాడులు పెరిగిపోయాయి

మాలమహానాడు యువసేన రాష్ట్ర అధ్యక్షుడు చంద్రచర్తి హరి

మంగళగిరి: రాష్ట్రంలో ఎన్నడూ లేనంతగా టీడీపీ అధికారంలోకి వచ్చి రెండు నెలలు కాకముందే మహిళలపై లైంగిక దాడులు పెరిగిపోయాయని, ఇది ఖచ్చితంగా ప్రభుత్వ వైఫల్యమేనని మాలమహానాడు యువసేన రాష్ట్ర అధ్యక్షుడు చంద్రచర్తి హరి ఆరోపించారు. మహిళలపై దాడులు నిరసిస్తూ శనివారం పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద బహుజన యువసేన మాలమహానాడు ఆధ్వర్యంలో బెస్ట్ అవైలేబుల్ స్కూలు పథకాన్ని పునరుద్ధరించాలని కోరుతూ రిలే నిరాహార దీక్షలకు మద్దతు తెలిపారు. హరి మాట్లాడుతూ ముచ్చుమర్రి ఘటన జరిగి నేటికి 21 రోజులైనా బాలిక మృతదేహం లభించలేదంటే ప్రభుత్వ నిర్లక్ష్యమే కారణమన్నారు. బాలిక కుటుంబానికి ప్రభుత్వం రూ.10లక్షలు ఇచ్చి చేతులు దులుపుకోవడం బాధాకరమన్నారు. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎస్సీ, ఎస్టీ చిన్నారులపై దాడులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. దాడులను నివారించడంలో ప్రభుత్వం, పోలీసులు వైఫల్యం చెందారన్నారు. దాడులకు పాల్పడ్డవారిపై ప్రభుత్వం చర్యలు తీసుకోకపోవడం వలనే దురాగతాలు పెరిగిపోయాయన్నారు. సమావేశంలో సామాజిక న్యాయవేదిక రాష్ట్ర కన్వీనర్ ఎం కుల్లాయప్ప, ప్రతినిధులు కె.సుక్కమ్మ, కె.రజిని, వరికూటి ప్రియ, పగిడి స్వర్ణలత, కర్ర శ్రీవల్లి, చిన్నం రాణి తదితరులు పాల్గొన్నారు.



అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న మాలమహానాడు నాయకులు

100 గ్రాముల బంగారం చోరీ

మంగళగిరి: పాత మంగళగిరి దేవుడి మాన్యంలో చోరీ ఘటన చోటు చేసుకుంది. శనివారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవుడి మాన్యం నివాసంలో వుంటున్న వంది బాబాజీరావు కుటుంబం పిల్లలతో కలిపి ఈ నెల 20 తేదీన శ్రీశైలం దైవదర్శనానికి వెళ్లారు. ఇది గమనించిన దుండగులు తాళం వేసి వున్న నివాసంలోకి ఇంటి వెనుక తలుపు పగలకొట్టి వెళ్లి ఇంటిలోని బీరువా పగలకొట్టి బీరువాలోని రూ.7లక్షల విలువైన 100 గ్రాముల బంగారంతో పాటు రూ 43 వేలు దోచుకెళ్లారు. బాబాజీరావు తనకుటుంబ సభ్యులతో కలిసి శనివారం తెల్లవారుజామున ఇంటికి వచ్చి చూడగా తలుపులు పగలకొట్టి ఉండడంతో చోరీ జరిగిందని గ్రహించి, పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ఉన్నత చదువులకు వెళ్లి.. విగత జీవిగా వచ్చి..

అమెరికాలో మృతి చెందిన హారిక మృతదేహం తెనాలి రాక



తెనాలిరూరల్: ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి అక్కడ రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గుంటూరు జిల్లా తెనాలి ఐతనగర్‌కు చెందిన జెట్టి హారిక మృతదేహం శనివారం ఉదయం తెనాలి చేరుకుంది. అమెరికా నుంచి శుక్రవారం రాత్రి హైదరాబాద్ చేరుకున్న భౌతికకాయాన్ని అంబులెన్స్ ద్వారా తెనాలి తీసుకువచ్చారు. ఈ నెల 20న అమెరికాలోని ఓక్లహామాలో జరిగిన రోడ్డుప్రమాదంలో హారిక మృతి చెందిన విషయం తెలిసిందే. వెటర్నరీ డాక్టర్ అయిన హారిక ఎంఎస్ చేసేందుకుగాను గతేడాది ఆగస్టులో అమెరికా వెళ్లి ఫుడ్ అండ్ న్యూట్రిషన్ సైన్స్‌లో ఎంఎస్ చేస్తూ పార్ట్‌టైం జాబ్ చేస్తూ, రోడ్డు ప్రమాదంలో మృతిచెందింది. తెనాలి వచ్చిన హారిక మృతదేహాన్ని చూసి తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు.

పూర్తయిన అంత్యక్రియలు..

ఐతానగర్‌కే చెందిన జెట్టి హారిక, తాడిబోయిన రవితేజలు అమెరికాలో జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో మృతి చెందగా వారి మృతదేహాలు స్వస్థలం తెనాలికి చేరుకున్నాయి. రవితేజ మృతదేహం శుక్రవారం సాయంత్రం రాగా హారిక మృతదేహం శనివారం ఉదయం వచ్చింది. ఇద్దరి అంత్యక్రియలను ఉదయం పూర్తి చేశారు.

ఏపీలో రాష్ట్రపతి పాలన విధించాలి

కమ్యూనిస్టు ఇండియా పార్టీ జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు



తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని కమ్యూనిస్టు ఇండియా పార్టీ జాతీయ కార్యదర్శి తోట సంగమేశ్వరరావు (సంగమ్) డిమాండ్ చేశారు. శనివారం గుంటూరు జిల్లా తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమాశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో లైంగికదాడులు, హత్యలు విపరీతంగా పెరిగాయని, వీటిని నియంత్రించే స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం లేదని, ఇలాంటి విషయాల్లో బాధితులకు ఎక్స్‌గ్రేషియా ఇచ్చి ప్రభుత్వం చేతులు దులుపుకొంటోందని విమర్శించారు. రాష్ట్రంలో అప్పులు అంతకంతకు పెరుగుతున్నాయని, వీటిని తీర్చేమార్గం ఏమిటో చెప్పమని ఎన్నిసార్లు అడిగినప్పటికీ ప్రభుత్వం దగ్గర సమాధానం లేదన్నారు. రాష్ట్రంలో వెంటనే రాష్ట్రపతి పాలన విధించకపోతే.. విజయవాడ ధర్నాచౌక్‌లో నిరవధిక నిరసన శిబిరం నిర్వహించాల్సి వస్తుందని హెచ్చరించారు.

నిమ్మకాయల ధరలు

తెనాలి: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1500, గరిష్ట ధర రూ.3500, మోడల్ ధర రూ.2400 వరకు పలికింది.

లాంఫామ్‌లో వ్యవసాయ స్థితిగతులపై వర్క్‌షాప్

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫామ్ వ్యవసాయ పరిశోధన స్థానంలో వ్యవసాయ స్థితిగతులపై శిక్షణ, సందర్శన(వర్క్‌షాప్)ను శనివారం నిర్వహించారు. లాంఫామ్ రీసెర్చ్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ దుర్గా ప్రసాద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గుంటూరు, పల్నాడు జిల్లాల వ్యవసాయ అధికారులు నున్న వెంకటేశ్వర్లు, మురళీలు ఆయా జిల్లాల్లో వ్యవసాయ స్థితిగతులను వివరించారు. గత సంవత్సరంతో పోల్చితే ఈ ఏడాది వర్షపాతం వ్యవసాయానికి అనుకూలంగా ఉందని, వివిధ పంటలు నాట్లు, విత్తనాలు విత్తుకోవటం సజావుగానే సాగుతుందని తెలిపారు. పత్తి పంట సాగుచేసే ప్రాంతాల్లో కొంత సాగు పొగాకుకు, కందికి అనుకూలంగా ఉందని సూచించారు. వివిధ డివిజన్ల అధికారులు పంటల సాగులో పురోగతి, సాగులో సమస్యలను వివరించారు. శాస్త్రవేత్తలు వివిధ పంటల్లో సూచనలు, సలహాలను అందించారు. లాంఫామ్ శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఫుట్‌బాల్ పోటీలకు ప్రవీణ్ ఎంపిక



చీరాల రూరల్: జాతీయస్థాయి జూనియర్ ఫుట్‌బాల్ జట్టుకు చీరాల విఠల్‌నగర్‌కు చెందిన వీఎన్వీ ప్రవీణ్ ఎంపికయ్యాడు. పట్టణంలోని ఎన్ఆర్అండ్‌పీఎం హైస్కూలులో 10వ తరగతి చదువుతున్నాడు. గత నెలలో బాపట్ల జిల్లా జట్టు తరఫున జోనల్ పోటీలకు ఎంపికయ్యాడు. గుంటూరు జిల్లా పేరేచర్లలో గతనెల 6న నిర్వహించిన జోనల్ పోటీల్లో ప్రకాశం, పల్నాడు, గుంటూరు జిల్లాల జట్లను ఓడించి జట్టును విజేతగా నిలిపాడు. అతని క్రీడా ప్రతిభను గమనించిన నిర్వాహకులు రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక చేశారు. విజయవాడలో గతనెల 5 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో జట్టును నాలుగో స్థానంలో నిలిపాడు. ఇందులో ప్రతిభ కనబరిచిన 30 మంది క్రీడాకారుల్ని ఎంపికచేసి అనంతపురంలోని ఫుట్‌బాల్ శిబిరంలో శిక్షణనిచ్చారు. వారిలో అత్యధిక ప్రతిభ కనబరిచిన ప్రవీణ్‌ను రాష్ట్రం తరఫున జాతీయ జట్టుకి ఎంపిక చేశారు. అసోం రాష్ట్రంలో ఈనెల 28 నుంచి ఆగస్టు 10వ వరకు జరిగే జాతీయస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ప్రవీణ్ పాల్గొంటాడని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వాసిమల్లి విజయకుమార్, జోనల్ కో–ఆర్డినేటర్ నూతలపాటి దేవదాసు తెలిపారు. ప్రవీణ్‌ను క్యాంప్ ఇన్‌చార్జ్ బి. ప్రేమయ్య, కోచ్ ప్రసన్న, సీనియర్ క్రీడాకారుడు ఎన్. నరేష్‌తో పాటు క్రీడాకారులు అభినందించారు.

కత్తి పద్మారావు రచనలు ఆవిష్కరణ

పొన్నూరు: ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ఆధ్వర్యంలో శనివారం ప్రముఖ కవి డాక్టర్ కత్తి పద్మారావు 71వ జన్మదినం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుల నిర్మూలన దినోత్సవం నిర్వహించారు. పట్టణంలోని అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లోని పద్మారావు నివాసంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా డాక్టర్ సమరం, డాక్టర్ ఇండ్ల రామసుబ్బారెడ్డి, బొర్రా గోవర్ధన్, సామల రమేష్, డాక్టర్ అంగలకుర్తి విద్యాసాగర్, కనపర్తి అబ్రహాం లింకన్, డాక్టర్ కోయి కోటేశ్వరరావు, ఫాదర్ బోస్కో, జాషువా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కత్తి పద్మారావు రచించిన అస్పృశ్యుని యుద్ధగాథ మూడో భాగం పుస్తకాన్ని ప్రొఫెసర్ కె.ఎస్.చలం ఆవిష్కరించి, డాక్టర్ వల్లంపట్ల నాగేశ్వరరావు, రాజపద్మకు అంకితం చేశారు. భారతదేశ చరిత్ర మూడో భాగాన్ని ప్రొఫెసర్ కె.వై.రత్నం ఆవిష్కరించి కట్టా వినయ్‌కుమార్, భానోదయకు అంకితం చేశారు. ప్రపంచ విజేతలు వ్యక్తిత్వ నిర్మాణం మూడో భాగాన్ని బి.ఎస్.రాములు ఆవిష్కరించి, దళిత మహిళా మేధావి ఎం.సుకన్యకు అంకితం చేశారు. కార్యక్రమంలో కవులు, రచయితలు, కళాకారులు, మేధావులు, పలు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. కత్తి చేతన్, వేము మాధవ్ పర్యవేక్షించారు.



పుస్తకాలను ఆవిష్కరించిన ప్రొఫెసర్ చలం, డాక్టర్ సమరం, వేదికపై డాక్టర్ కత్తి పద్మారావు

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

నిందితుల్లో ఇద్దరు రౌడీషీటర్లు

తెనాలిరూరల్: హత్యాయత్నం కేసులో నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. పాత కక్షల నేపథ్యంలో రాడ్లు, కర్రలతో విచక్షణారహితంగా చేసిన దాడిలో ఇద్దరు రౌడీషీటర్లు ఉన్నారు. స్థానిక త్రీ టౌన్ పోలీస్ స్టేషన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ ఎం.రమేష్ మాట్లాడుతూ ఇటీవల సుల్తానాబాద్‌లో ఇద్దరు యువకులపై ఆరుగురు కలిసి దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన ఘటనలో నిందితులను అరెస్టు చేసినట్లు చెప్పారు. త్రీ టౌన్ సీఐ ఎస్.రమేష్ బాబు, టూ టౌన్ సీఐ ఎ.సుధాకర్, త్రీటౌన్ ఎస్ఐ ఎన్.ప్రకాశరావుతో వివరాలను తెలియజేశారు. డీఎస్పీ కథనం మేరకు.. ఐతానగర్‌కు చెందిన దోమ రాకేష్‌పై తెనాలి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ కేసు నమోదైంది. దీంట్లో ఫిర్యాదుదారుడైన యడ్లలింగయ్య కాలనీకి చెందిన తలవరస విజయ్‌బాబు అలియాస్ అప్పును దోమ రాకేష్ పలుమార్లు ఫోన్ చేసి కేసు రాజీ చేసుకుందామని కోరాడు. దీంతో కేసు రాజీ చేసుకోమని నన్నే అడుగుతావా అంటూ ఆగ్రహించిన విజయ్‌బాబు ఈ నెల 21వ తేదీన దోమ రాకేష్, అతడి స్నేహితుడైన ఏడుకొండలుపై సుల్తానాబాద్‌లోని సుందరయ్య నగర్‌కు తన ఐదుగురు స్నేహితులతో కలిసి అక్కడికి వెళ్లి విచక్షణారహితంగా దాడి చేశారు. దాడిలో రాకేష్ తీవ్రంగా గాయపడగా, ఆస్పత్రిలో చికిత్స అందిస్తున్నారు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు ప్రధాన నిందితుడైన విజయ్‌బాబుతో పాటు దాడిలో పాల్గొన్న అతడి స్నేహితులు యడ్లలింగయ్య కాలనీకి చెందిన శివ్ కుమార్, ముత్యాల విజయ్, ఇందిరా కాలనీకి చెందిన ఉట్ల భార్గవ్, సుల్తానాబాద్ సుందరయ్యనగర్‌కు చెందిన శెట్టి నాని, ఐతానగర్‌కు చెందిన కొత్తపల్లి కోటేశ్వరరావులను శనివారం ఉదయం అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ ఎం.రమేష్ మాట్లాడుతూ బాధితుడు రాకేష్‌పై ఆరుగురు కలిసి కర్రలు, రాడ్లతో విచక్షణారహితంగా దాడి చేశారని అన్నారు. ఆరుగురు నిందితులలో ఏ–1 తలవరస విజయ్‌బాబు అలియాస్ అప్పు, ఏ5 శెట్టి నానిపై ఒక్కొక్కరిపై 10కి పైగా పాత కేసులు ఉన్నట్లు తెలిపారు. ఇటువంటి దాడులకు ఎవరు పాల్పడినా ఉపేక్షించేది లేదని రౌడీషీట్ ఓపెన్ చేయడంతో పాటు వారిపై పీడీ యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందన్నారు. అవసరమైతే నగర బహిష్కరణ చేసేందుకు కూడా వెనుకాడబోమని డీఎస్పీ స్పష్టం చేశారు. నిందితులను కోర్టులో హాజరుపరుస్తున్నట్లు చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రమేష్, పక్కన సీఐలు రమేష్‌బాబు, సుధాకర్

కేవీకేలో ముగిసిన శిక్షణ తరగతులు



శిక్షణ తరగతుల్లో పాల్గొన్న గ్రామీణ యువతతో కేవీకే శాస్త్రవేత్తలు

గుంటూరు రూరల్: నగర శివారుల్లోని లాంఫాం నందున్న కృషివిజ్ఞాన కేంద్రంలో గత ఆరురోజులుగా నిర్వహిస్తున్న పుట్టగొడుగుల పెంపకంపై శిక్షణ తరగతులు శనివారంతో ముగిశాయి. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేవీకే ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఎం.యుగంధర్‌కుమార్ మాట్లాడుతూ యువతకు ఉపాధి లక్ష్యంగా కేవీకేలో శిక్షణ తరగతులు నిర్వహించటం జరుగుతుందన్నారు. అదేవిధంగా నాబార్డ్ సహకారంతో వారికి ప్రోత్సాహకాలను అందించటం జరుగుతుందన్నారు. యువతకు శిక్షణతోపాటు ఎంటర్‌ప్రెన్యూర్ ప్రాక్టీస్‌ను చేయించడం జరిగిందని చెప్పారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ ఎం.గంగాదేవి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గోరంట్ల మేనేజర్ కె.కృష్ణవేణి, షేక్ బాజీ, ఎం.వినయ్‌లు అగ్రికల్చర్ లోన్ పాయింట్ మేనేజర్లు పుట్టగొడుగుల పెంపకం యూనిట్‌కోసం రుణాలు పొందే విధానం, దరఖాస్తు చేసుకొనే విధానం వివరించారు. అనంతరం శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. కేవీకే శాస్త్రవేత్తలు, గ్రామీణ యువత పాల్గొన్నారు.

గజ ఈతగాళ్ల అప్రమత్తతతోనే ప్రమాదాల నివారణ

బాపట్ల టౌన్: గజ ఈతగాళ్లు అప్రమత్తంగా ఉన్నప్పుడే తీరంలో ప్రమాదాల్ని నివారించగలమని బాపట్ల డీఎస్పీ సీహెచ్. మురళీకృష్ణ తెలిపారు. జిల్లా ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు సూర్యలంక సముద్ర తీరంలో శనివారం ఆయన గజ ఈతగాళ్లు, పోలీస్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. తొలుత పోలీస్ ఔట్ పోస్ట్, టవర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ వారాంతాల్లో రెండు తెలుగు రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో పర్యాటకులు జిల్లాలోని సూర్యలంక, వాడరేవు, రామాపురం బీచ్‌లకు వచ్చే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా భద్రత చర్యలు తీసుకోవాలని సూచించారు. సముద్ర తీరాల్లో గజ ఈతగాళ్లను అప్రమత్తంగా ఉంచాలని తెలిపారు. ఎరుపు రంగు జెండాలను దాటి ఎవరూ సముద్రంలోకి వెళ్లకుండా చూసుకోవాలని చెప్పారు. సముద్ర తీరంలో సమర్థంగా గస్తీ నిర్వహించాలని తెలిపారు. మద్యం తాగిన వారు సముద్రంలోకి దిగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఆకతాయిలు పర్యాటకుల్ని ఇబ్బందులకు గురి చేస్తున్నా, అసభ్యకరంగా ప్రవర్తిస్తున్న వెంటనే వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.